క్లుప్తంగా

3 నుంచి పల్స్‌పోలియో

సిర్పూర్(టి): ఈ నెల 3 నుండి 5 వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తామని లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు నవత తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. మండలంలో మొత్తం 3170 మంది చిన్నారులు ఉన్నారని, వారికి చుక్కలు వేయడానికి 25 బూత్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లింగాపూర్: ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు రాథోడ్ రమేష్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు వేలువాక శ్రీకాంత్‌చారి గురువారం ప్రకటనలో కోరారు. అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రూ.10లక్షల వరకు ఆర్థిక సాయం బ్యాంక్ ద్వారా అందించడం జరుగుతోందని వివరించారు. నాయకులు అశోక్, అశ్విన్, దవీత్‌కుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు గుర్తింపు అవార్డులు అందిస్తాం



మాట్లాడుతున్న డీటీడీవో రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్: ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను గుర్తించి వారికి రివార్డులు అందిస్తామని డీటీడీవో రమాదేవి అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్దవ్, హెచ్ఎం కృష్ణారావు, డీఎస్‌వో మీనారెడ్డి ఉన్నారు.

మీడియా అకాడమీ చైర్మన్‌కు శుభాకాంక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమించబడిన శ్రీనివాసరెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశాడు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాలు, ఇళ్లు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని శ్రీనివాసరెడ్డిని కోరినట్లు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నాలుగేళ్ల కోసారి జన్మదినం



బిడ్డతో తల్లి పులాతాయి

కెరమెరి(ఆసిఫాబాద్): నాలుగేళ్లకు ఓసారి వచ్చే లీపు సంవత్సరం రోజు పుట్టిన చిన్నారుల జన్మదినం కూడా నాలుగేళ్లకు ఓసారి చేయాల్సి ఉంటుంది. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆకుల్‌వార్ పులాతాయి, తుకారాం దంపతులకు కుమారుడు జన్మించాడు. వీరిది ఇచ్చోడ మండలంలోని సోన్‌పల్లి గ్రామం కాగా కెరమెరి మండల కేంద్రంలోని పుట్టింటికి ప్రసూతి కోసం రాగా.. గురువారం బిడ్డకు జన్మనిచ్చింది.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సైన్స్ టీచర్లకు పలు సూచనలు చేశారు. పదో తరగతిలో ఎక్కువ మంది విద్యార్థులకు ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత తగ్గుతుందన్నారు. వివిధ రకాల ప్రశ్నలతో అభ్యసనం చేయించాలని సూచించారు. ఎస్‌వో సుభాశ్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో లోకేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ 60 ఏళ్ల వయస్సు పైబడిన భవన నిర్మాణ రంగ కార్మికులకు నెలకు రూ.6 వేల పింఛన్ అందించాలని, దసరా కానుకగా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులందరికీ రూ.30 అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు చిరంజీవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నా రు.

గడ్డి విత్తనాలకు మంగళం..?

- విత్తనాలు సరఫరాలో అంతరాయం
- పశుగ్రాసానికి తప్పని తిప్పలు
- ఆందోళన చెందుతున్న రైతులు



పశువుల కోసం జొన్నపంట సాగుచేస్తున్న రైతులు

కెరమెరి: ప్రస్తుత పరిస్థితుల్లో పశుపోషణ భారంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో యేటా పంపిణీ చేసే గడ్డి విత్తనాల సరఫరాలో ఈ ఏడాది అంతరాయం ఏర్పడింది. దీంతో పశుగ్రాసం లభించక మూగజీవాలు ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు. కెరమెరి మండలం 90శాతం వ్యవసాయ అధారిత మండలం కావడంతో పశువులు బాగానే ఉన్నాయి. కానీ ఈసారి గడ్డి విత్తనాలకు ప్రభుత్వం మొండి చేయి చూపింది.

పంపిణీ లేదు...

మండలంలోని 31 గ్రామ పంచాయతీ ఉన్నాయి. వాటిలో పశువులు 18,507, గేదెలు 673, మేకలు 33,254, గొర్రెలు 644 ఉన్నాయి. ప్రతి ఏటా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 75శాతం రాయితీపై ఏటా గడ్డి విత్తనాలు సరఫరా చేసేవారు. ఇందు కోసం బడ్జెట్ కేటాయించి కొనుగోలు చేసి రైతులకు ఇచ్చేవారు. ఈ విత్తనాలు ప్రతీ ఏడాది డిసెంబర్, జనవరి నెలల్లో పశువైద్యశాలకు చేర్చి అక్కడ నుంచి రైతులకు రాయితీపై అందించేవారు. అయితే ఈ ఏడాది రాయితీ విత్తనాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ఈసారి పంపిణీ నిలిచిపోయినట్లు తెలుస్తుంది. యాసంగి ఆరంభంలో పంపిణీ చేసే గడ్డి విత్తనాలు రైతులు వేసవిని దృష్టిలో పెట్టుకొని సాగు చేశారు. తద్వారా గ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకునేవారు. కానీ ఈసారి ఇప్పటి వరకు కూడా గడ్డి విత్తనాలు పశువైద్యశాలకు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు...

గడ్డి విత్తనాలు ఇప్పటి వరకు అందకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. జొన్న, మొక్కజొన్న పంటల వైపు దృష్టి సారించారు. తమ తమ పొలంలో బోర్లు వేసి బిందు సేద్యం ద్వారా జొన్న, మొక్కజొన్నను పండిస్తున్నారు. మండలంలో మొత్తం రైతులు 6436 మంది ఉండగా, 29వేల ఎకరాల్లో పంటలను పండిస్తుండగా అందులో 700ఎకరాల్లో జొన్న, 500 ఎకరాల్లో మొక్కజొన్నను పండిస్తున్నారు. బోర్లు ఉన్న వారు ఎలాగైనా తమ పశువులను కాపాడుతుంటే.. వర్షాధారిత పంటల రైతులు మాత్రం చొప్పున బయటి నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం స్పందించి గడ్డి విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రతీ సంవత్సరం గడ్డి విత్తనాలు రాయితీపై ఇచ్చేవారు. కానీ ఇప్పటి వరకు మండలానికి చేరుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న విషయం వస్తావమే. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేసి విత్తనాలు అందేలా చూస్తాం.

\- పెందోర్ మోతీరాం, ఎంపీపీ

శాంతిభద్రతల రక్షణ అందరి బాధ్యత

- ఎస్పీ సురేశ్ కుమార్
- జిల్లా కేంద్రంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



కవాతులో పాల్గొన్న ఎస్పీ

ఆసిఫాబాద్: సమాజంలో శాంతిభద్రతలు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కేంద్ర బలగాల కవాతును జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి పట్టణంలో కేంద్ర బలగాలతో నిర్వహించిన కవాతులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి వర్గ విబేధాలు, అల్లర్లు లేకుండా ఉండేందుకు జిల్లాలో ఆయా చోట్ల అవగాహన సదస్సులు, కవాతు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కేంద్రంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్ నందవార్, ఇన్స్‌పెక్టర్ ప్రధాన్ రమేశ్ కుమార్, సీఐలు సతీశ్, రాణాప్రతాప్, డిసిఆర్‌బి ఇన్స్పెక్టర్ రమేశ్, ఆర్ఐ పెద్దన్న, అంజన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడగింపు...

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో శాంతి భద్రతల నేపథ్యంలో కొనసాగుతున్న పోలీస్ 30 యాక్ట్‌ను మార్చి 1వ తేదీ నుంచి 31 వరకు పొడగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పోలీస్ 30 యాక్ట్ అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసుల అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



కెరమెరి: పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ



ఆసిఫాబాద్: సీసీ పనులు ప్రారంభిస్తున్న గణేశ్

కెరమెరి: నిర్మాణం చేపట్టే పనుల్లో నాణ్యత ఉండాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. గురువారం ఆయన మండలంలోని చొపన్‌గూడ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సిమెంట్, కాంక్రీటు, ఇసుక తగిన మోతాదులో వాడాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నీరు పోయాలని, అప్పుడే రోడ్డు అధిక మన్నిక కలిగి ఉంటుందని వివరించారు. ఝరి మాజీ సర్పంచ్ న్యానేశ్వర్, నాయకులు ఆత్రం బొజ్జిరావు, కుసుంబ్‌రావు ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఆసిఫాబాద్: మండలంలోని కొమ్ముగూడ, బూర్గుడ, చోర్‌పల్లి గ్రామాల్లో ఎన్జీఆర్ఎఫ్ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రాథోడ్ గణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో గ్రామంలో రూ.3లక్షల నిధులతో సీసీ రోడ్ నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగు గ్యారంటీలు ప్రారంభమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్ల నారాయణ, గడ్డల సత్తయ్య, ఎండీ నిజాం, ఇస్మాయిల్, సైదం తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

లింగాపూర్: రూ.కోటి 5లక్షలతో లింగాపూర్ మండలానికి అభివృద్ధి పనులు ఉపాధి హామీ పథకంలో మంజూరైనట్లు జెడ్పీటీసీ ఆడె రక్మాబాయి లక్యానాయక్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దాదానగర్ గ్రామంలో గురువారం సీసీ రోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యలమంచిలి జగన్‌బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వార్ల తిరుపతి, వేణు, తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మిషన్ భగీరథ పైపుల పరిస్థితిని పరిశీలించి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో క్రిష్టారావు అన్నారు. ఈ నెల 28న సాక్షి దినపత్రికలో సమస్యల్లో కొత్తగూడ అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందన వచ్చింది. శనివారం ఎంపీడీవో కొత్తగూడ గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేతి పంపు ఉన్నప్పటికీ సీజనేబుల్ కావడంతో ఇబ్బంది ముంచుకొస్తుందని మిషన్ భగీరథ పైపులు పగలడంతో నీరు గ్రామానికి చేరడం లేదని చెప్పగా.. లీకేజీ అయినా ప్రాంతానికి వెళ్లి స్వయంగా పరిశీలించారు. మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని, అంగన్‌వాడీ కేంద్రం మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని తెలిపారు. గ్రామ కార్యదర్శి గణేశ్ ఉన్నారు.

అన్నదానం

రెబ్బెన: గోలేటి వారసంతలో గురువారం గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు వసీం, మోఈజ్, సైఫ్‌లు మాట్లాడుతూ ప్రతీ గురువారం గోలేటిలో ఏర్పాటు చేస్తున్న వారసంతకు వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలు, ఇతర సరుకులు అమ్ముకునేందుకు రైతులు, వ్యాపారులు వస్తుంటారని తెలిపారు. అలాంటి రైతులు, చిరు వ్యాపారులు ఆకలితో అలమటించకుండా ఉండాలనే లక్ష్యంతో ప్రతి గురువారం గోలేటి సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వారసంతకు వచ్చే రైతులు, చిరువ్యాపారులు, ప్రజలు అన్నదానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నర్సరీ మొక్కల రక్షణకు చర్యలు తీసుకోవాలి



దహెగాం: నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో



సిర్పూర్(టి): నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

దహెగాం: మండలంలోని మొట్లగూడ, రాంపూర్, దిగిడ గ్రామాల్లోని నర్సరీ పనులను గురువారం ఎంపీడీవో రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో మొక్కలు నాటి సంరక్షించుకోవాలన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్నందున గ్రీన్‌నెట్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

నర్సరీలను పరిశీలించిన ఎంపీడీవో

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి, నవేగాం, సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నర్సరీలను గురువారం సిర్పూర్(టి) ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. మొక్కల సంరక్షణ చూసుకోవాలని, వేసవిలో నీటి ఎద్దడి లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో మోహన్, పంచాయతీ కార్యదర్శి హరీష్, గ్రామస్తులు ఉన్నారు.

వర్మికంపోస్టు తయారు చేయాలి

కెరమెరి: సెగ్రిగేషన్ షెడ్లలో వర్మి కంపోస్టును తయారు చేయాలని ఎంపీడీవో క్రిష్టారావు అన్నారు. గురువారం మండలంలోని దేవాపూర్, అనార్‌పల్లి, తుమ్మగూడ గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించారు. నర్సరీలు, శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతివనాలను ఆయన పరిశీలించారు. చాలా చోట్ల వానపాముల తయారీతో జరగడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. నర్సరీల్లో ప్రతీరోజు రెండు సార్లు నీటిని మొక్కలకు పట్టాలని తెలిపారు. పల్లె ప్రకృతివనలను శుభ్రంగా ఉంచాలని సంబంధిత కార్యదర్శులకు ఈ సందర్భంగా సూచించారు.

కబడ్డీ పోటీల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 8, 10వ తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఎస్సై సాగర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల మైదానంలో నిర్వహించే కబడ్డీ పోటీలకు జిల్లాలోని క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉద్యోగ విరమణ సిబ్బందికి సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని వివిధ గనుల్లో గురువారం ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు, మెడికల్ ఇన్వ్యాలిడేట్ అయిన ఉద్యోగులకు తోటి ఉద్యోగులు, ఆయా గనుల అధికారులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గోలేటి సీహెచ్‌పీలో జనరల్ మజ్దూర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆకుల రాయమల్లు దంపతులను సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం రాజు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కైరిగూడ ఓసీపీలో విధులు నిర్వహిస్తూ ఇటీవల మెడికల్ ఇన్వ్యాలిడేట్ అయిన ఉద్యోగులు రహమాన్, రవీంద్రకుమార్, కృష్ణమూర్తి, గుడిమల్ల లింగయ్య, లింగాల సారయ్యలను తోటి ఉద్యోగులు సన్మాంచి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, టీబీజీకేఎస్ ఏరియా నాయకులు వీరస్వామి, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి ఎంబడి రామయ్య, హెచ్ఎంఎస్ ఫిట్ కార్యదర్శి హరి, ఐఎన్‌టీయూసీ ఫిట్‌కార్యదర్శి రవికుమార్, ఏఐటీయూసీ కైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు



అవగాహన కల్పిస్తున్న డీటీ శ్రావణ్ కుమార్

లింగాపూర్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆర్ఐలు రాథోడ్ ప్రకాష్, ప్రదీప్ అన్నారు. గురువారం మండలంలోని ఏల్లాపటార్ గ్రామపంచాయతీ పరిధిలోని రామునాయక్‌తండా గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు హాజరై గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని చట్టాలను ప్రతీ పౌరుడు గౌరవిస్తూ వాటిని ఆచరణలో తీసుకోవాలన్నారు. పౌరులు వ్యక్తిగత జీవన శైలి విధివిధానాలను, సామాజిక బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువజన సంఘాలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన

వాంకిడి: మండలంలోని జంబుల్‌ధరి గ్రామంలో గురువారం పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ దుర్గం శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్న సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చట్టాన్ని గౌరవిస్తూ హక్కులను తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై పోషెట్టి, గిర్దవార్ అబ్దుల్ మాజీద్, పంచాయతీ కార్యదర్శి సత్య నారాయణ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని నర్సాపూర్ పునరావాస కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణ పనులకు గురువారం ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనుల ఏర్పాటు కోసం భూములు అప్పగిస్తున్న నిర్వాసితులకు అన్ని వసతులతో కూడిన పునరావాస కేంద్రాలను యాజమాన్యం ఏర్పాటు చేస్తోందన్నారు. అందులో భాగంగా ఏరియాలో నూతనంగా నర్సాపూర్ పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పునరావాస కేంద్రంలో అన్ని వసతులను కల్పించామన్నారు. దానిలో భాగంగా సింగరేణి నిధులతో గ్రామస్తుల కోసం నూతన హనుమాన్ ఆలయాన్ని సైతం నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్ రావు, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, మేనేజర్ మహేష్, ఎంపీటీసీ సభ్యురాలు యశోద, గ్రామస్తులు జంగు పటేల్, కన్నయ్య, జమునా పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతం



సిర్పూర్(టి): పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల, సాంఘిక సంక్షేమ డీపీఐపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల (కాగజ్‌నగర్)కు చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం మొదటి రోజు 243 మంది విద్యార్థులకు 242 మంది పరీక్షలకు హాజరయ్యారు. కేవలం ఒకే విద్యార్థి గైర్హాజరైనట్లు సీఎస్ రమేష్ తెలిపారు.

మొదలైన ఇంటర్ సెకండియర్ పరీక్షలు

దహెగాం: ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో 128 మంది విద్యార్థులకు 122 మంది హాజరు కాగా మరో ఆరుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సీఎస్ అమరేందర్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగానే కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

కెరమెరి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా రెండోరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కొనసాగిన సెకండ్ ఇయర్ తెలుగు పరీక్షకు 146 మంది విద్యార్థులకు 145 మంది హాజరైనట్లు సీఎస్ పర్శారాములు, డీవో సునీల్ కుమార్ తెలిపారు. ఆరుగురు సిబ్బంది ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గురువారం రైతులు, ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు బ్యాంకు ద్వారా లభించే భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పంట రుణాలు సకాలంలో చెల్లించి వడ్డీలో రాయితీని పొందాలని సూచించారు. బ్యాంకులో లభించే రుణాలు, వివిధ పథకాలపై అవగాహక కల్పించారు. ఫీల్డ్ ఆఫీసర్ వి.రవి, అకౌంటెంట్ అనిల్, క్యాషియర్ మనోజ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రెండ్రోజులు రైల్వేగేటు బంద్

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ-వేంపల్లి గ్రామాల మధ్యలోని రైల్వేగేటు ఈ నెల ఒకటో తేదీ రాత్రి 8 గంటల నుంచి 2వ తేదీ ఉదయం 8 గంటల వరకు రైల్వేగేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వేగేటు మేయింటనెన్స్‌లో భాగంగా రైల్వేగేటు మరమ్మతుల నిర్వహణ కొనసాగుతుంటాయని తెలిపారు. ప్రయాణికులు సహకరించి పెద్దబండ, చింతకుంట, చుంచుపల్లి గ్రామాల మీదుగా కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకోవాలని సిర్పూర్(టి) ఎస్సై రమేష్ కోరారు.